సాక్షి విజయనగరం

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



మినహాయింపు

- 8లో

ఎన్నికల విధుల నుంచి ఎవరిని మినహాయించాలో ఎన్నికల విభాగం నిర్ణయిస్తుందని, వాస్తవ పరిస్థితుల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు.



తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

విజయనగరం జిల్లా పార్లమెంటరీ నియోజవర్గ టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున మందే తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు.

- 8లో



ధీమా ఇచ్చిన వైఎస్సార్ బీమా

ఆపద సమయాన వైఎస్సార్ బీమా పథకం కింద ప్రభుత్వం ఆపన్నహస్తం అందిస్తోంది. ఆర్థికంగా ఆదుకుంటోంది.

- 8లో

న్యూస్‌రీల్

జాబ్‌మేళా రేపు

పార్వతీపురం టౌన్: పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి అధికారి ఆర్.వహీదా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ కృష్ణా ఫార్మసీ వంద ట్రైనీ ఖాళీల భర్తీ చేయనుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జాబ్ సీకర్ లాగిన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి తొలుత వేతనం నెలకు రూ.15 వేలు చెల్లిస్తారని, 2019 నుంచి 2023 మధ్య బీఎస్సీ కెమిస్ట్రీ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. విద్యార్హత పత్రాలు ఒరిజినల్స్, జెరాక్స్ కాపీ, ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

15న విజ్ఞాన ప్రదర్శన

- డీఈఓ ఎన్.ప్రేమకుమార్



విజయనగరం అర్బన్: విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు, శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 15న ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహిస్తామని డీఈఓ ఎన్.ప్రేమకుమార్ సోమవారం తెలిపారు. విజయనగరం పట్టణంలోని శ్రీచలపతి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో పోటీలు జరుగుతాయన్నారు. జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల విద్యార్థులు 2022-23 సంవత్సరంలో మంజూరు చేసిన ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శన పోటీలకు తీసుకురావాలన్నారు. ఒక్కో ప్రాజెక్టు ప్రదర్శనకు ఒక విద్యార్థి ఒక గైడ్ హాజరుకావాలన్నారు. ఉమ్మడి విజయనగరం వేదికగా జరిగే పోటీల్లో మొత్తం 180 ప్రాజెక్టులు ప్రదర్శిస్తామని తెలిపారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు ఎస్సీఈఆర్టీ, పాఠశాల విద్య ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయని జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఎం.కృష్ణారావు తెలిపారు.

ఫార్మాసిస్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట (విశాఖపట్నం): ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫార్మాసిస్టుల గ్రేడ్-2 నియామకాలకు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు డాక్టర్ బి.సుజాత (విశాఖ,జోన్) నోటిఫికేషన్ జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి ,విశాఖ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 8 ఫార్మాసిస్టు గ్రేడ్-2 పోస్టులు భర్తీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ నెల 27వ తేదీన దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను రేసవానిపాలెంలోని ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు వారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు డి.ఫార్మా/ బి.ఫార్మా ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు మాత్రమే అర్హులన్నారు. వివరాల కోసం https://nagendrasvast.wordpress.com వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఓసీ అభ్యర్థులు రూ.500, మిగిలిన కులాలకు చెందిన అభ్యర్థులు రూ.300, డిమాండ్ డ్రాఫ్ట్ తీసి దరఖాస్తుకు జత చేయాలన్నారు. రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ, విశాఖపట్నం పేరిట డీడీ తీయాలని డాక్టర్ సుజాత తెలియజేశారు.

వేగవంతంగా ఇళ్ల రిజిస్ట్రేషను



జేసీ కార్తీక్

విజయనగరం అర్బన్: 'పేదలందరికీ ఇళ్లు' పథకం కింద లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లను వేగవంతంగా పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. ఎస్‌పీఐ రిజిస్ట్రేషన్లు, కేస్ట్ సర్వే, ఆడుదాం ఆంధ్రా యూసీల సమర్పణ, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, యాప్ డౌన్‌లోడ్, రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్, గృహనిర్మాణం తదితర అంశాలపై మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సోమవారం సమీక్షించారు. సర్వే ప్రక్రియలో హద్దు రాళ్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఎన్నికల విధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణకు సంబంధించి తక్షణమే యూసీలను పంపించాలని ఆదేశించారు. లబ్ధిదారులను చైతన్యవంతం చేసి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ పి.బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ ఏ.కళ్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అద్దం



దశాబ్దాలుగా టీడీపీ నాయకులకు పట్టం కట్టినా విజయనగరం జిల్లా కేంద్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉండేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక చారిత్రక నేపథ్యం ఉన్న విజయనగరం ప్రగతిపట్టాలెక్కింది. విద్యాలయాల రాకతోపాటు ప్రధాన కూడళ్లన్నీ అందంగా ముస్తాబయ్యాయి. పార్కులు, నగరంలోని చెరువు గట్లు పర్యాటక ప్రాంతాలుగా విరాజిల్లుతున్నాయి. విజయనగరంలోని 50 డివిజన్లలో ఏ డివిజన్‌ను చూసినా అభివృద్ధి కళ్లకు కడుతుంది. సంక్షేమ పథకాల లబ్ధి డాష్‌బోర్డుల రూపంలో సాక్షాత్కరిస్తుంది. పట్టణానికి వచ్చేవారికి 'ఇది మన విజయనగరం' అని గట్టిగా నినదించేలా ప్రగతి కనిపిస్తుంది. దీనికి మచ్చుకు 14వ డివిజన్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని ఓసారి తరచిచూద్దాం.

- విజయనగరం నగరపాలక సంస్థ ప్రగతిపథం
- గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అనేక మౌలిక వసతులు
- ఆదర్శప్రాయంగా 14వ డివిజన్
- సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పథకాలన్నీ సద్వినియోగం
- ఆనందంలో డివిజన్ ప్రజలు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఓ వైపు ధనికులు, మరోవైపు పేదలు నివసించే విజయనగరంలోని 14వ డివిజన్‌ను గత టీడీపీ పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఇదిగో తాము ఈ అభివృద్ధి చేశామని చూపించుకోవడానికి ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా చేయలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక డివిజన్ రూపురేఖలే మారిపోయాయి. అక్కడ నివసిస్తున్న 1,150 కుటుంబాల్లోని అర్హుల ఇళ్లకు సంక్షేమ పథకాలు చేరువయ్యాయి. 5,648 మంది జనాభా అవసరాల మేరకు మౌలిక వసతులు సమకూరాయి. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఇచ్చిన సహకారంతో విద్య, వైద్యం సహా అన్ని సదుపాయాలు చేరువయ్యాయి. ప్రభుత్వ తోడ్పాటుకు తోడు నగరపాలక సంస్థ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు (రాజేష్) ప్రత్యేక కృషితో డివిజన్ ఓ రోల్‌మోడల్‌గా మారింది.



రూపుమారిన కొత్తపేట కుమ్మరివీధి ప్రాంతం



ఇదే మా అందమైన బడి

చిత్రంలో కనిపిస్తున్నది 14వ డివిజన్‌లోని కొత్తపేట కుమ్మరివీధిలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాల. నాడు కనీస సదుపాయాలకు నోచుకోని పాఠశాల నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.23 లక్షలతో అన్ని సౌకర్యాలున్న పాఠశాలుగా అభివృద్ధి చేసింది. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మరో రెండు అదనపు గదుల నిర్మాణానికి కార్పొరేషన్ నుంచి నిధులు కేటాయించారు. స్థానిక కార్పొరేటర్ సొంతగా ఆరు తరగతి గదులకు ఏసీ సౌకర్యం కల్పించారు. ఆర్వో ప్లాంట్‌తో రక్షిత తాగునీటి సదుపాయం కల్పించారు. దృఢ సంకల్పంతో పనిచేసే 9 మంది ఉపాధ్యాయులు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియంలో బోధనతో కార్పొరేట్ స్కూల్‌కు దీటుగా తయారైంది. ఒకప్పుడు ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ ఐదుగురు ఉపాధ్యాయులు, 70 మంది విద్యార్థులతో ఉండే ఈ పాఠశాలలో.. నేడు 240 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. టైల్స్‌తో ఫ్లోరింగ్, తరగతి గదుల్లో ఏసీ సౌకర్యంతో పాటు అదనపు గదులు నిర్మించడంతో ప్రాథమిక పాఠశాల ఇప్పుడు ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. పేదకుటుంబాల పిల్లల బంగారు భవిష్యత్తుకు బాసటగా నిలుస్తోంది.

నిత్యసేవలో వార్డు సచివాలయం

ఒక విజన్‌తో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థలో భాగంగా ఇక్కడ 17వ నంబర్ వార్డు సచివాలయాన్ని ఏర్పాటుచేశారు. తొమ్మిది మంది కార్యదర్శులు తమ విభాగ సేవలను ప్రజలకు అందించడంలో ముందుంటున్నారు. ప్రభుత్వ పాలనను ప్రజల వద్దకు, వారి సమస్యలను అధికారుల వద్దకు చేర్చడంలో 22 మంది వలంటీర్లు ఉత్తమమైన సేవలు అందిస్తున్నారు. సచివాలయంలో సేవలు, కార్యదర్శుల ఫోన్ నంబర్లతో బోర్డులు, పథకాల సమాచార ప్రసారానికి ఫ్లోర్‌లీడర్ ప్రత్యేక టీవీ ఏర్పాటు చేయించారు.



నాడు-నేడు నిధులతో అందంగా ముస్తాబైన ప్రాథమిక పాఠశాల నుంచి వస్తున్న చిన్నారులు

14వ డివిజన్ స్వరూపం ఇలా....

జనాభా	:	5,648
ఓటర్లు	:	3,750
వీధులు	:	9 (కొత్తపేట కూరెళ్లవారి వీధి, పులిగెడ్డవారి వీధి, పద్మశాలి వీధి, కుమ్మరివీధి, గొల్లవీధి, గౌడ వీధి, సుద్దవీధి, గ్రంధి కిత్తయ్య కొనేరు గట్టు)

మౌలిక సదుపాయాలు

బోర్లు	:	39
పబ్లిక్ కొళాయిలు	:	21
వ్యక్తిగత కొళాయిలు	:	252
సీసీ రోడ్లు	:	2.75 కిలోమీటర్లు
బీటీ రోడ్డు	:	0.95 కిలోమీటర్లు
డ్రెయిన్లు	:	2100 మీటర్లు
కల్వర్టులు	:	12

ప్రభుత్వ భవనాలు...

- 17వ వార్డు సచివాలయం
- కేపీ గొల్ల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల
- వైఎస్సార్ అర్బన్ క్లినిక్
- కుక్కల బంగ్లా
- 2 మున్సిపల్ పార్కులు
- గ్రంధి కిత్తయ్య కోనేరు
- 3 పబ్లిక్ టాయిలెట్లు
- 2 అంగన్‌వాడీ సెంటర్లు
- 2 రేషన్ డిపోలు



సచివాలయంలో అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలిపే డాష్‌బోర్డు



ప్రజారోగ్యానికి భరోసా కల్పించేలా..

ఒకప్పుడు ఏ చిన్న అనారోగ్యం వచ్చినా రెండు కిలోమీటర్ల దూరంలోని లంకా పట్నం బంగారమ్మపేట లోనున్న పీహెచ్‌సీకి 14వ డివిజన్ ప్రజలు వెళ్లాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయంతో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (ఆస్పత్రి) అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ కూడా మందులు ఉంచడానికి అదనంగా ర్యాక్‌లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్‌ను కార్పొరేటర్ సొంత డబ్బుతో ఏర్పాటు చేయించారు. డాక్టర్ గదికి ఏసీ సౌకర్యం కల్పించారు. అత్యవసర పరిస్థితిలో ఉన్నవారికి తక్షణమే ప్రాథమిక వైద్యచికిత్స అందించడానికి వీలుగా ఒక గదిని ఐసీయూ తరహాలో అభివృద్ధి చేశారు. ప్రతిరోజూ 70 నుంచి 80 మంది వరకూ ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు.

ఆదర్శవంతంగా...



ఒకప్పుడు మురికివాడగా ఉన్న కుమ్మరివీధి కొత్తపేట ప్రాంతాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి కృషితో ఆదర్శవంతంగా మారింది. నాలుగుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నుకున్న ప్రజల సేవలతో నిరంతరం తరిస్తున్నా. ఓ వైపు సంక్షేమ పథకాలు, యువతకు ఉపాధికల్పనతో పాటు వార్డులో సౌకర్యాల కల్పనకు తన వంతు కృషిచేస్తున్నా. గత టీడీపీ పాలనలో విజయనగరానికి ఒరిగిందేమీ లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేయగలిగాం.

– శెట్టి వీరవెంకట రాజేశ్వరరావు, ఫ్లోర్‌లీడర్, విజయనగరం నగరపాలక సంస్థ



వార్డు సచివాలయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న లబ్ధిదారులు



కుమ్మరి వృత్తివారికి సౌకర్యంగా ఏర్పాటుచేసిన ఆమశాలలు

2,144 టిడ్కో ఇళ్ల పంపిణీకి సన్నాహాలు



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

విజయనగరం గంటస్తంభం: కొద్ది రోజుల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 2,144 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగిస్తామని రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. సోనియానగర్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను సోమవారం పరిశీలించారు. వివిధ పనులపై అధికారులతో సమీక్షించారు. సాలూరులో 1056, విజయనగరం సారిపల్లిలో 1088 గృహాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తామన్నారు. ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తయిన వాటిని లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే 95వేలు గృహాలను లబ్ధిదారులకు అప్పగించామని, ఫిబ్రవరి 17 నాటికి నిర్దేశించిన లక్షా 50వేలు ఇళ్లు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు తాగునీరు, విద్యుత్, రోడ్ల సౌకర్యం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో టిడ్కో ఎస్ఈ నరసింహమూర్తి, ఈఈ ఎ.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. మంత్రి విజయవాడ నుంచి ఉదయం 10.30 గంటలకు నగరానికి చేరుకొని జేఎన్‌టీయూ జీవీలో బాలికల అదనపు హాస్టల్ భవనం, సివిల్, మెటలర్జికల్ భవనాల ప్రారంభోత్సవం, వైస్ చాన్సలర్ లాంచ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని తన నివాసానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి విశాఖ చేరుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ఆడుదాం-ఆంధ్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి విజయవాడ చేరుకుంటారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి

విజయనగరం అర్బన్: చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు తినేవారికి ఆరోగ్యం సిద్ధిస్తుందని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి అన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 'చిరుధాన్యాల సాగు, వాటి వినియోగంపై ఎంట్రప్రెన్యూర్స్‌కు మరియు వినియోగదారులకు అవగాహన' అనే అంశంపై సోమవారం జరిగిన ఒక్కరోజు సదస్సులో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలను ఆహారపు అలవాట్లలో భాగం చేసుకోవాలన్నారు. డివిజనల్ ఫారెస్ట్ అధికారి కె.జానకీరావు మాట్లాడుతూ చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. మల్లువలసలోని ఆరోగ్య మిల్లెట్ సీఈఓ సరస్వతి మాట్లాడుతూ చిరుధాన్యాలతో వివిధ రకాల ఆహారపదార్థాలు తయారు చేసుకోవచ్చన్నారు. అనంతరం చిరుధాన్యాల వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫర్ మిల్లెట్ సిస్టర్స్ ఎఫ్‌పీఓ సెక్రటరీ కె.జోగినాయుడు, ఆరోగ్యం సంస్థ వ్యవస్థాపకుడు డి.వి.కృష్ణారెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్, అన్ని విభాగాల డీన్స్, టీచింగ్, నాన్ టీచింగ్, సిబ్బంది పాల్గొన్నారు.



చిరుధాన్యాల ప్రదర్శన పరిశీలిస్తున్న వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి

మత్తు వదిలిస్తాం..

- గంజాయి తదితర మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదుల పరిష్కారానికి కృషి
- అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటా..
- విశాఖ రేంజ్ నూతన డీఐజీ విశాల్ గున్ని

సాక్షి, విశాఖపట్నం/విజయనగరం టౌన్: నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్)పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, దానికి అనుగుణంగానే తమ పనితీరు ఉంటుందని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని చెప్పారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని, అక్రమ రవాణాను నిర్మూలిస్తామని, ఏజెన్సీ ప్రాంత జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను రేంజ్ పరిధిలోని 5 జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డీఐజీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేంజ్ పరిధిలోని గల వివిధ జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి తమ శాఖలోని అన్ని విభాగాలను పటిష్టపరిచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ స్థాయిలోనే ఫిర్యాదు ఇచ్చిన వారందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తన ప్రథమ కర్తవ్యమన్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలకు లోబడి పనిచేస్తూ ముందుకు వెళతామన్నారు. తాను అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, వార్తలు ప్రచురించే ముందు తనను లేదా ఎస్పీ స్థాయి అధికారులను సంప్రదించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులను కోరారు. సోషల్ మీడియాలో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ అవాస్తవాలను వార్తలుగా ప్రచురించడం రోజురోజుకు పెరుగుతోందని, ఈ కారణంగా ప్రజలు అయోమయానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వార్త ప్రచురించే ముందు నిజనిర్ధారణ చేసుకోవాలని సూచించారు.



విశాఖ రేంజ్ డిఐజీగా బాధ్యతలు చేపట్టిన విశాల్ గున్నీకి మొక్కను అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

తొలి పోస్టింగ్ నర్సీపట్నం ఏఎస్పీగా..

2010 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన విశాల్ గున్ని శిక్షణానంతరం నర్సీపట్నం సబ్ డివిజన్ ఏఎస్పీగా పనిచేశారు. 2013 నుంచి 2015 వరకు నర్సీపట్నం ఏఎస్పీగా చేసిన ఆయన పదోన్నతిపై ఓఎస్డీగా నియమితులయ్యారు. అనంతరం నెల్లూరు,, తూర్పుగోదావరి జిల్లాల ఎస్పీగా, గ్రేహౌండ్స్ ఎస్పీగా, విజయవాడ డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేశారు. విజయవాడ నుంచి పదోన్నతిపై విశాఖ రేంజ్ డీఐజీగా వచ్చారు. విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక విశాల్ గున్నీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతి సాగుపై అధ్యయనం

వేపాడ: ప్రకృతి సాగు పద్ధతులపై అమెరికా, కర్ణాటక బృందాలు అధ్యయనం చేశాయి. వేపాడ మండలం కుమ్మపల్లి క్లస్టర్‌లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేస్తున్న పంటలను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. వావెర్లీ స్ట్రీట్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ జారెడ్ బ్లూమెన్‌ఫీల్డ్, సీనియర్ లీడర్ జగదాశివన్, కాలిఫోర్నియా బృందం సభ్యులు ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు, నవధాన్యాల సాగు, సేంద్రియ కషాయాల తయారీ పద్ధతులను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. డెక్క ఈశ్వరరావు మామిడి తోటలో సాగుచేస్తున్న అంతర పంటలు, 20 సెంట్లల్లో నిరంతరం పండించే పంటలు (ఏటీఎమ్ మోడల్ పద్ధతి), దిగుబడి, రాబడి వివరాలను రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చాన్సలర్ విజయకుమార్ తెలియజేశారు. ఫుడ్‌బాస్కెట్ అమలు తీరును వివరించారు. అనంతరం డీపీఎం ఆనంద్ అధ్యక్షతన కుమ్మపల్లిలో నిర్వహించిన సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి రామారావు, రీజనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీఓ హేమసుందర్‌లు ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. మహిళా సంఘాలకు రుణాల మంజూరు, చెల్లింపులు, రుణాల సద్వినియోగం, సంఘాల పనితీరును ఏపీఎం శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో కొత్తవలస, వేపాడ ఏఓలో ఎ.ఎల్.విజయ, యశ్వంతరావు, ఎస్ఆర్‌పీ రాజ్యలక్ష్మి, సర్పంచ్ నౌడు అరుణ, డీపీఎంయూ, ఎన్ఎఫ్ఏఎస్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



కుమ్మపల్లిలో ప్రకృతి, సేంద్రియ సాగు పద్ధతులను అమెరికా బృందం సభ్యులకు వివరిస్తున్న వైస్ చాన్సలర్ విజయకుమార్

క్లుప్తంగా

నేడు శంబర పోలమాంబ నాల్గవ జాతర


పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి నాల్గవ జాతర మంగళవారం జరగనుంది. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు అవసరమైన లడ్డూ, పులిహోర ప్రసాదాలను తయారు చేయించారు. జాతరకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా సీఐ జి.బాలకృష్ణ, ఎస్సై నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

120 లీటర్ల సారా పట్టివేత

జియ్యమ్మవలస: మండలంలోని కన్నపుదొరవలస పరిసర ప్రాంతాల్లో చినమేరంగి పోలీసులు సోమవారం ఉదయం కాపు కాసి 120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు. పట్టుకున్న ఇద్దరు నిందితుల దగ్గర 6 ప్లాస్టిక్ క్యాన్లు సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఆయనతో పాటు హెచ్‌సీ సోములు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గ్రామంలో విద్యుత్ షాక్‌తో గ్రామానికి చెందిన బడే అప్పలనాయుడు (34) సోమవారం మృతిచెందాడు. దీనిపై చినమేరంగి ఎస్సై చిన్నంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం కొత్త ఇంటి నిర్మాణంలో భాగంగా సోమవారం ఉదయం మార్బుల్స్ వేయగా వాటిని తడపడానికి అప్పల నాయుడు వెళ్లాడు. ఈ క్రమంలో చేతికి విద్యుత్ వైరు చేతికి తగిలి షాక్ కొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సింహాద్రి నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

సాలూరు: పాచిపెంట మండలంలోని గడివలస గ్రామానికి చెందిన కోరాడ జోగేశ్వరరావు (47) హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి పట్టణంలోని రూరల్ సీఐ స్టేషన్‌లో నిందితులను విలేకరులకు చూపించారు.ఈ సందర్భంగా పాచిపెంట ఎస్సై నారాయణరావుతో కలిసి సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన గడివలస గ్రామ సమీప పొలంలో జోగేశ్వరరావును హత్య చేశారని మృతుని భార్య గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టామన్నారు. ఫిర్యాదు మేరకు నిందితులు అదే గ్రామానికి చెందిన కోరాడ నర్సింహులు(50), కోరాడ అప్పారావు(59),కోరాడ ఉమా మహేశ్వరరావు (31)లను సోమవారం మంచాడవలస సమీపంలో పట్టుకున్నామని తెలిపారు. కాగా వరుసకు చిన్నాన్న పెదనాన్న పిల్లలైన వారికి భూ గట్టు విషయంలో కొంతకాలంగా తగాదా ఉందన్నారు.ఈ క్రమంలోనే ఈ నెల 10న పొలం వద్ద జోగేశ్వరరావును నర్సింహులు కొడవలితో పీక కోసివేయగా, కాళ్లు చేతులను కోరాడ అప్పారావు, కోరాడ ఉమా మహేశ్వరరావులు పట్టుకుని హత్యకు సహకరించారని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని, కేసు దర్యాప్తు కొనసాగుతుందని సీఐ వివరించారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

- పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఎదుటే ఘర్షణ


సభాస్థలం వద్ద ఘర్షణకు దిగిన టీడీపీ నాయకులు

గుర్ల: విజయనగరం జిల్లా పార్లమెంటరీ నియోజవర్గ టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున మందే తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. గుర్ల మండలంలోని పాలవలసలో టీడీపీ కార్యాలయం ప్రారంభం , ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి కిమిడి నాగార్జున ముఖ్య అతిథిగా సోమవారం హాజరయ్యారు. పార్టీ కార్యక్రమాలు చేపడుతుండగా గ్రామంలోని టీడీపీ నాయకుడు గేదెల అప్పలనాయుడు వర్గం కార్యకర్తలు సభాస్థలం వద్దకు వచ్చి ఘర్షణకు దిగారు. దీంతో గ్రామంలో రెండవ వర్గంగా ఉన్న తాడ్డి శ్రీనివాసరావు అనుచరులు, గేదెల అప్పలనాయుడు అనుచరులు నాగార్జున సమక్షంలోనే కొట్లాటకు దిగి కుర్చీలు విసిరుకున్నారు. మండలస్థాయి నాయకులు ఎంతవారించినా వారి మాటలను పట్టించుకోలేదు. దీంతో చేసిదేమీలేక పార్టీ నాయకులు సమావేశాన్ని ముగించేశారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు తాడ్డి శ్రీనివాసరావు కారుపై దాడి చేసి అద్దాలు, డోర్స్ ధ్వంసం చేశారు. ఈ సమాచారం తెలుసుకున్న గుర్ల ఎస్సై భాస్కరరావు గ్రామానికి చేరుకుని టీడీపీ నాయకులను చెదరగొట్టారు. క్రమశిక్షణకు మారుపేరు టీడీపీ అని చెప్పుకోవడం తప్ప వాస్తవంగా క్రమశిక్షణ పార్టీలో లేదని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు.

నిబంధనల మేరకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు

- కలెక్టర్ నాగలక్ష్మి
- కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం


అర్జీలను కలెక్టర్ నాగలక్ష్మి


పార్వతీపురం: వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత కుమార్


పార్వతీపురం టౌన్: బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ సునీల్ షరోన్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం అర్బన్: ఎన్నికల విధుల నుంచి ఎవరిని మినహాయించాలో ఎన్నికల విభాగం నిర్ణయిస్తుందని, వాస్తవ పరిస్థితుల్ని మాత్రమే మినహాయింపులకు పరిగణనలోకి తీసుకుంటారని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం అధికారులతో మాట్లాడుతూ చాలామంది అధికారులు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరారని, అయితే రెగ్యులర్‌గా విధులకు హాజరవుతున్న వారిని వారి వాస్తవ పరిస్థితి ఆధారంగా మినహాయింపు ఇస్తారని తెలిపారు. బాలింతలను 3 నెలల వరకు, వికలాంగులకు 75 శాతం పైబడిన వారికి మినహాయింపు ఉంటుందని చెప్పారు. అలాగే జూన్ 30 లోపల రిటైర్ అయ్యే వారిని ఎన్నికల విధులనుంచి మినహాయి స్తామని తెలిపారు. వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను నియామకం చేసేందుకు మార్చి 31వ తేదీలోగా నోటిఫికేషన్ జారీ చేయవలసి ఉందని, ఈ నెలాఖరులోగా అన్ని శాఖలలో ఉన్న ఖాళీల వివరాలను తెలియజేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

201 అర్జీల స్వీకరణ

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి వాటిపై స్పందించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, డిప్యూటీ కలెక్టర్లు సుమబాల, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర్ రావుతో కలసి కలెక్టర్ నాగలక్ష్మి వివిధ సమస్యలపై 201 వినతులు స్వీకరించారు.

అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలి: కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కేశవ నాయుడులతో కలిసి ప్రజలనుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 167 అర్జీలు అందజేశారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, బీసీ వెల్ఫేర్ అధికారి ఎస్.కృష్ణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా ప్రజా రవాణా అధికారి టి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం: ఏఎస్పీ సునీల్ షరోన్

పార్వతీపురంటౌన్: ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని ఏఎస్పీ సునీల్ షరోన్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, ఆ సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ సీహెచ్ వాసు నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు తక్షణ న్యాయం చేయాలి

విజయనగరం క్రైమ్: స్పందనలో ఫిర్యాదుచేసిన బాధితులకు తక్షణమే న్యాయం చేకూర్చాలని విజయనగరం జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి బాధితుల నుంచి 41 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, ఏడు పనిదినాల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యల నివేదికలను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు, ఎస్బీ సీఐలు కేకేవీ.విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, టాస్క్‌ఫోర్స్ సీఐ కె.అశోక్ కుమార్, ఎస్సై ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు అందజేయాలి

- ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీడీ

విజయనగరం ఫోర్ట్: అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలను రైతులకు అందజేయాలని ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీడీ డాక్టర్ బి.ముకుందరావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక గాజులరేగలోని ఏరువాక కేంద్రంలో సోమవారం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వరి పంటకు సంబంధించి బీపీటీ 3082, బీపీటీ 2858, ఆర్‌జీఎల్ 7016 రకాలు అనుకూలమైనవన్నారు. పెసర, పొద్దుతిరుగుడు వేరుశనగల్లో మంచి రకాలను ప్రోత్సహించాలని సూచించారు.

ఉద్యానశాఖ ఎ.డి శైలజ మాట్లాడుతూ మామిడిలో సస్యరక్షణ శిక్షణ కార్యక్రమాలు పెరగాలని ఆకాంక్షించారు. పశుపోషణలో సూపర్ నేపియర్ గడ్డిని వినియోగించేలా ప్రచారం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీకే జగన్నాథరావు, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ కెల్ల లక్ష్మణ్, శాస్త్రవేత్తలు డాక్టర్ పీవీ సత్యనారాయణ, డాక్టర్ అనూరాధ, డాక్టర్ కుమారి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ స్వాతి, డాక్టర్ కె.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో భారీ మెజార్టీతో గెలుస్తాం

- వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు


సమావేశంలో ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

కంచిలి/సోంపేట: రానున్న ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తున్నామని వైఎస్సార్‌సీపీ రీజినల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోంపేట మండలంలోని బారువ బీచ్ రిసార్ట్‌లో నియోజకవర్గ ముఖ్య నేతలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. శాశ్వత సమస్యలకు పరిష్కారం, ఇంటింటికి సంక్షేమ పథకాలతో మారిన ప్రజా జీవితాలు, పార్టీ, కులం, మతం భేదం లేకుండా అన్ని పథకాలు అందరికీ అందేటట్లు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే సాధ్యమైందని స్పష్టం చేశారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రోగులకు పూర్తిగా అండగా నిలిచిన జగనన్న పలాసలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ వ్యాధి పరిశోధన కేంద్రాన్ని, రెండు నియోజకవర్గాల ప్రజలకు శుద్ధజలాలలను అందించేందుకుగాను హిరమండలం గొట్టాబ్యారేజ్ వంశధార రిజర్వాయర్ నుంచి శుద్ధిచేసిన నీటిని తీసుకొచ్చి ఇచ్చే బృహత్తర కార్యక్రమాన్ని పూర్తిచేశారని గుర్తుచేశారు. కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి బలమని, వ్యక్తిగత కోర్కెలు, విభేదాలుంటే పక్కన పెట్టి పార్టీ విజయానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సర్వేలను ప్రజలు నమ్మే రోజులు పోయాయని, ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

గొలుసు దొంగకు ఆరుమాసాల జైలు

జామి: గొలుసు దొంగతనం చేసిన ముద్దాయికి 6మాసాల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ ఎస్.కోట జేఎఫ్‌సీఎం తీర్పు వెలువరించింది. ఈ కేసుపై జామి ఎస్సై వీరబాబు అందించిన వివరాల ప్రకారం గత ఏడాది నవంబర్ 3వ తేదీన లొట్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎం అరుణకుమారి బైక్‌పై పాఠశాలకు వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో బంగారం గొలుసు తెంచి పరారయ్యాడు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన భీమరశెట్టి కమలనాథ్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేసి చోరీ జరిగిన బంగారం గొలుసు రికవరీ చేశారు.నిందితుడిని కోర్టులో హాజరుపరచగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసవరావు వాదనలు వినిపించారు. వాదనల అనంతరం ముద్దాయిని నిర్ధారించి న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

హత్య కేసులో జీవిత ఖైదు

సాలూరు రూరల్: మండలంలోని తోణాం పంచాయతీ బెంగుడువలస గ్రామానికి చెందిన చోడిపల్లి రాజయ్యకు పార్వతీపురం అడిషనల్ కోర్టు మెజిస్ట్రేట్ జీవిత ఖైదు శిక్ష విధించారు. ఈ మేరకు స్థానిక ఎస్సై ఎం.వెంకటరమణ సోమవారం తెలిపారు. 2016 సెప్టెంబర్ 16న చోటిపల్లి సీతమ్మకు చిల్లంగి ఉందన్న నెపంతో అదే గ్రామానికి చెందిన రాజయ్య నాటు తుపాకీతో ఆమెను కాల్చి చంపాడు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో హత్య చేసిన ముద్దాయికి కోర్టు జీవిత ఖైదు శిక్ష ఖరారు చేసింది.

ధీమా ఇచ్చిన వైఎస్సార్ బీమా

- బాధితులకు ఆసరాగా నిలుస్తున్న పథకం



వైఎస్సార్ బీమా లోగో


భోగాపురం మండలం ముంజేరు గ్రామ సచివాలలయ పరిధిలో మరణించిన యేరుసు రాము నామినీ తోటమ్మ అందుకుంటున్న బీమా సొమ్ము

విజయనగరం అర్బన్: జీవన ప్రయాణంలో అన్నిరకాలుగా అదృష్టం కలిసొస్తే జీవితం సాఫీగా సాగిపోతుంది. పొరపాటున ఊహించని సంఘటన ఏదైనా జరిగి, కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రాణాలు వదిలితే ఆ కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుంది. అదే నిరుపేదల పరిస్థితైతే వర్ణనాతీతం. అలాంటి పేద కుటుంబాల దిగులు తీర్చి ధీమా కల్పిస్తోంది వైఎస్సార్ బీమా పథకం. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదల కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపుతోంది.

పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. అనుకోని విధంగా ప్రమాదం జరిగినప్పుడు ఎవరూ ఆదుకోరనే భయాన్ని పోగొట్టారు. దీంతో నిరుపేదలకు భరోసా లభించింది. ప్రభుత్వం 2020 అక్టోబర్ 22న రాష్ట్రంలో వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. తెల్లరేషన్ కార్డు కలిగిన 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయసు వరకు ప్రజలందరూ ఈ పథకానికి అర్హులు. ప్రమాదవశాత్తు, వృద్ధాప్యం తదితర కారణాలతో మృతిచెందినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా ఈ పథకం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం లభిస్తుంది. కుటుంబంలో నామినీగా ఉన్న వ్యక్తికి బీమా నగదు అందు తుంది. ఆ ప్రకారం ఏదైనా ప్రమాదంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షలు, 18–50 ఏళ్లలోపు సహజ మరణం పొందిన వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందుతుంది. తక్షణ సాయంగా దహన సంస్కారాలకు రూ.10 వేలు అందజేస్తారు.

725 కుటుంబాలకు ప్రయోజనం

జిల్లా వ్యాప్తంగా గత ఏడాది జూలై నుంచి ఇప్పటి వరకు వైఎస్సార్ బీమా కింద సహజ మరణాలకు, ప్రమాదాల మరణాలకు సంబంధించి 725 కేసులు నమోదయ్యాయి. అందులో సహజ మరణాలకు ఇచ్చే రూ.ఒక లక్ష చొప్పున 647 కుటుంబాలకు ప్రభుత్వం మొత్తం రూ.6.47 కోట్లు బీమా సొమ్ము అందజేసింది. అలాగే వివిధ ప్రమాదాల్లో మృత్యువాతపడిన 78 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.3.9 కోట్ల బీమా సొమ్ము లభించింది. మొత్తం 725 మంది కుటుంబాలకు చెందిన నామినీలకు రూ.10.37 కోట్ల ప్రయోజనం చేకూరింది. బీమాకు సంబంధించిన పత్రాలను సమర్పించిన 21 రోజుల్లోగా ప్రభుత్వం నామినీ ఖాతాలకు సొమ్ము జమ చేస్తుండడం విశేషం. దీంతో బాధిత కుటుంబాలకు దిగులు తీర్చి బీమా ద్వారా ధీమా కలిగించినట్లవుతోంది. ఈ పథకం అమలు పట్ల సర్వత్రా హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.


ఎ.కల్యాణ చక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ

వైఎస్సార్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

తెల్లరేషన్ కార్డు కలిగిన పేదలంతా వైఎస్సార్ బీమా పథకానికి అర్హులు. సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి పెద్దకు ఏమైనా జరిగితే నిబంధనల ప్రకారం అన్ని పత్రాలను సమర్పించిన 21 రోజుల్లోనే నామినీకి క్లెయిమ్‌ను అందజేస్తాం. ప్రభుత్వం ఈ పథకం ద్వారా పేద కుటుంబాలకు అండగా నిలుస్తోంది.

సూఫీ సుగంధ మహోత్సవానికి ఆహ్వానం


జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న డాక్టర్ ఎం.డి ఖలీల్ ఉల్లా షరీఫ్, తదితరులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని బాబామెట్టలో గల ప్రసిద్ధ సూఫీ పుణ్యక్షేత్రం, నిత్యాన్నదాన క్షేత్రంలో హజరత్ ఖాదర్ వలీ బాబా 65వ సూఫీ సుగంధ మహోత్సవాలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ముస్లిం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ఖాదర్ వలీబాబా దర్బార్, దర్గా ముతావల్లీ డాక్టర్ ఎం.డి ఖలీల్ ఉల్లా షరీఫ్‌లు సోమవారం జెడ్పీ చైర్మన్‌ను ఆయన నివాసంలో కలిశారు. భారీ అన్నదాన కార్యక్రమం, బాబా గ్రంథం, చాదర్ సమర్పణ, పటం ఊరేగింపు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. అలాగే చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు, జెడ్పీ చైర్మన్ తనయ మజ్జి సిరి సహస్రను కూడా 65వ సూఫీ సుగంధ మహోత్సవాలకు ఆహ్వానిస్తూ పత్రికను అందజేశారు.

డ్రాగా ముగిసిన ఆంధ్రా, యూపీ రంజీ మ్యాచ్

- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఆంధ్రా ఖాతాలో 3 పాయింట్లు
- బౌలర్ శశికాంత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'


ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన కేవీ శశికాంత్

విజయనగరం రూరల్: డెంకాడ మండలం చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆంధ్రా– యూపీ రంజీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. సోమవారం జరిగిన ఆఖరి రోజు ఆటలో ఆంధ్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 429 సాధించడంతో ఫలితం తేలే అవకాశాలు లేక ఇరు జట్ల కెప్టెన్లు గంట ముందుగానే డ్రాకు అంగీకరించారు. దీంతో యూపీ జట్టుపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన ఆంధ్ర జట్టుకు 3 పాయింట్లు, యూపీ జట్టుకు 1 పాయింట్ లభించింది. నాలుగు రోజైన సోమవారం ఆటలో ఓవర్ నైట్ స్కోర్ 271/5 పరుగులతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆంధ్ర జట్టు మరో 4 వికెట్లు కోల్పోయి 158 పరుగులు జోడించి 429 పరుగులు చేసింది. కెప్టెన్ రికీ బుయ్ తన ఓవర్ నైట్ స్కోర్ 100 పరుగులకు మరో 29 పరుగులు జోడించి అవుట్ కాగా, వైస్‌కెప్టెన్ ఎస్‌కె రషీద్ (85 పరుగులు), నితీష్‌కుమార్ రెడ్డి (53 నాటౌట్) అర్ధ సెంచరీలతో రాణించారు. యూపీ బౌలర్ సౌరభ్‌కుమార్ 5 వికెట్లతో రాణించాడు. బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణించిన ఆంధ్రా ఆటగాడు కేవీ శశికాంత్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

అథ్లెటిక్స్ పోటీల్లో పైడిరాజు ప్రతిభ

సాలూరు రూరల్: జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన కనకల పైడిరాజు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈనెల 8 నుంచి 11 తేదీవరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 800మీటర్లు, 400మీటర్ల పరుగు పందెంలో వెండి పతకాలు, 100మీటర్ల రిలే పందెంలో కాంస్య పతకం సాధించారు. పైడిరాజు చూపిన ప్రతిభ పట్ల జె.మోహన్, ఎస్. శశికళ, రామకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.